# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ లో రైతుల నుంచి ఉల్లి పంటను కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2. తెలంగాణలో క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో నిధులు 16 రెట్లు పెంచామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు**

**3. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానానికి ప్రణాళికలు రూపొందించామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.**

**4. తెలుగులో వ్యావహారిక భాష కోసం కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

===========================

ఆంధ్రప్రదేశ్ లో ఉల్లి రైతుల నుంచి క్వింటాకు 1200 రూపాయల చొప్పున చెల్లించి కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రైతుల నుంచి ఉల్లి పంట కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఉల్లిపాయల ధరలు ఏ మేరకు ఉన్నాయనే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఉల్లి పంట దిగుబడి ఎక్కువ ఉన్న కారణంగా రైతులకు నష్టం వాటిల్లకుండా, కొనుగోళ్లు ప్రారంభించాలని అన్నారు. ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లకు పంపిణీ చేయాలని. పంటను నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలని సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో 53,వేల 922 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు -ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు నిన్న సమావేశమై 30 ప్రాజెక్టులను ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టులతో 83,వేల 437 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి కావాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పూర్తి కావాలని. ఇప్పటికే ప్రారంభించిన ప్రాంతాల్లో మినహా మిగతా నియోజకవర్గాల్లో 3 నెలల్లో ఈ పార్కులు అందుబాటులోకి రావాలని ముఖ్యమంత్రి సూచించారు.

-------------------------

తెలంగాణను క్రీడా రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశానికి ముఖ్యమంత్రి నిన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో నిధులు 16 రెట్లు పెంచామని, యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీనపడిందని దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలుపుతూ,

వాయిస్ 24 సెకన్లు

---------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులతో విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వి.అనిత సమీక్ష నిర్వహించారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని, కృష్ణా పరివాహకంతో పాటు లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. మరోవైపు వర్షాల దృష్ట్యా విద్యుత్ అధికారులతో ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలని అధికారులకు గొట్టిపాటి సూచించారు.

---------------------------

ఇది ఇలా ఉండగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద నీరు వచ్చి చేరుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, . బుడమేరుకు ఎలాంటి వరద ఉధృతి లేదన్నారు. వరద ప్రవాహం పై ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలియజేస్తూ,

వాయిస్ 20 సెకన్లు

---------------------------

అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణాలో మరో నాలుగు రోజులపాటు పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానానికి ప్రణాళికలు రూపొందించామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, నదుల అనుసంధానానికి పొరుగు రాష్ట్రాల సమ్మతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సముద్రంలోకి వృధాగా కలిసే జలాలనే ఆంధ్రప్రదేశ్ వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

తెలుగు భాషను పరిరక్షించి .. ఆ భాష గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియ జేసే ఉద్దేశ్యంతో ఈరోజు తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు. తెలుగు వ్యావహారిక భాషోద్యమ కర్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. వాడుక భాషకు పట్టం కట్టిన గిడుగు రామమూర్తి పంతులు శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగం పర్వతాల పేటలో 1863 వ సంవత్సరం ఆగస్టు 29వ తేదీన జన్మించారు. గ్రాంథిక భాషలో వున్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి... నిత్య వ్యవహారిక భాషలో వున్న చక్కదనాన్ని, సౌలభ్యాన్ని తెలియజెప్పారు. బహుభాషావేత్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు 1940వ సంవత్సరం జనవరి 22 వ తేదీన తన 76వ ఏట తుది శ్వాస విడిచారు.

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణలో అదనపు ఎరువుల సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఎరువుల లభ్యత, నిర్వహణ పై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి 18 వేల టన్నుల యూరియా వస్తుందని, వారం రోజుల్లో మరో 21 వేల టన్నులు రానుందని అన్నారు. రాష్ట్రంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.

---------------------------

ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి ఈ రోజు. 1905 ఆగస్టు 29వ తేదీన ఉత్తరప్రదేశ్లోని అలహాబాద్ నగరంలో జన్మించిన ఆయన హాకీ క్రీడలో ప్రపంచంలోనే అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకరుగా ఖ్యాతి గడించారు. 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో ఆయన భారతదేశానికి వరుసగా స్వర్ణ పతకాలు సాధించి... దేశ ప్రతిష్టను ఇనుమడింప చేశారు. హాకీ క్రీడా మాంత్రికునిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తోంది.హాకీ క్రీడా రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ... కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మ భూషణ్ పురస్కారంతో సత్కరించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కు 10,వేల 350 మెట్రిక్ టన్నుల యూరియా కేంద్రం మంజూరు చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా సరఫరా విషయంపై కేంద్ర వ్యవసాయ ఎరువుల రసాయనిక మంత్రితో సంప్రదింపులు జరిపామని ఈ మేరకు రాష్ట్రానికి కేటాయించిన యూరియా గంగవరం పోర్టుకు చేరుకుంటోందని తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని వ్యవసాయ పంటల సాగు పరిస్థితిని, దృష్టిలో ఉంచుకుని అవసరాలమేరకు యూరియా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు . ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ఖరీఫ్ సీజన్ కి తగిన నిల్వలు ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు

=====================